పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 | సంచిక : 727 | పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు | ఎడిటర్ : ఎస్. మస్తాన్ | శుక్రవారం 25.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

## ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు..

# ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర తరువాయి 2లో



## రిజర్వాయర్లలో నీరు నింపండి

# వర్షాలపై సీఎం చంద్రబాబు ఆదేశం

**భారీ వర్షా ల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

- గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం
- ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన
- వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, క్రీడలు, విద్యుత్ సరఫరాపైనా కీలక ఆదేశాలు జారీ

రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన తరువాయి 2లో



## వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.

# కేంద్రం కీలక నిర్ణయం

- సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు బ్యాంకుల సమ్మె
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ముందే జీతాలు
- సెప్టెంబర్ 25నే వేతనాలు చెల్లించాలని కేంద్రం ఆదేశం
- ప్రజల సౌలభ్యం కోసం ఆదివారం బ్యాంకులు తెరిచి ఉంచాలని నిర్ణయం
- 5 రోజుల పనిదినాల డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్న యూనియన్లు

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన తరువాయి 2లో

## నీట్ పీజీ ఫలితాలు విడుదల

### రిజల్ట్స్, స్కోర్‌కార్డ్ డైరెక్ట్ లింక్!.

- నీట్ పీజీ 2026 ఫలితాలను విడుదల చేసిన NBEMS
- అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫలితాలు, ర్యాంకుల వివరాలు
- వివిధ కేటగిరీలకు క్వాలిఫైయింగ్ కటాఫ్ స్కోర్లను ప్రకటించిన బోర్డు
- అక్టోబర్ 1 నుంచి స్కోర్‌కార్డులు, ఆన్సర్ కీ డౌన్‌లోడ్‌కు అందుబాటులో



2లో

## బెంగాల్‌లో అదానీ భారీ పెట్టుబడులు

# ఏకంగా రూ. లక్ష కోట్లు!

- 2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ వెల్లడి
- కోల్‌కతా సమీపంలో రూ. 4,000 కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన
- ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ
- బెంగాల్‌ను తమ కర్మభూమిగా భావిస్తున్నట్టు అదానీ వ్యాఖ్య




ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక తరువాయి 2లో

## ఇరాన్ యుద్ధ హెచ్చరికలు

# భారత ఆర్థిక, రక్షణ రంగాలపై ప్రభావం

- ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు నుంచి వచ్చిన కీలక హెచ్చరిక
- ఇప్పటికే పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రానికి విస్తరించిన ఉద్రిక్తతలు
- భారత్‌కు చమురు ధరలు, రవాణా ఖర్చులు పెరిగే ప్రమాదం



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ఈ యుద్ధం హిందూ మహాసముద్రం వరకు కూడా వ్యాపించవచ్చని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామం భారత్ ఇంధన దిగుమతులు, సముద్ర వాణిజ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఉద్రిక్తతలు హిందూ మహాసముద్రానికి వ్యాపిస్తే, అది భారత వాణిజ్య, ఇంధన భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి సలహాదారుగా ఉన్న యహ్యా రహీం సఫావి ఈ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ మరిన్ని దాడులకు పాల్పడితే, యుద్ధాన్ని తరువాయి 2లో




## చిన్న వ్యాపారులకు ఊరట

# UPI ఛార్జీలపై NPCI స్పష్టత

- రూ. 2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై కొత్తగా ఎండీఆర్ ఛార్జీలు
- దేశంలోని 75 శాతం వ్యాపారులపై ఈ ఛార్జీల ప్రభావం ఉండదన్న ఎన్‌పీసీఐ
- ఛార్జీల భారం అధికంగా బడా వ్యాపార సంస్థల పైనే పడుతుందని వెల్లడి
- కస్టమర్లపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామని ఎన్‌పీసీఐ హామీ
- యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని అంచనా

2లో

బ్యాంకింగ్ రంగంలో పారదర్శకతను పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) ఫిక్స్‌డ్ డిపాజిట్ల (FD) నిబంధనల్లో కీలక మార్పులు చేపట్టింది. ప్రధానంగా రూ.3 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన బల్క్ డిపాజిట్లను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ నూతన మార్గదర్శకాలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.



# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు.

*** కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం**

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్‌అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంటపోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

*** గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది**

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు. దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

*** ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ (SAP)తో భేటీ**

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (SAP) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (SME) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు SAP నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్&డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

*** స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి**

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

*** వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం**

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (AMTZ) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (EMC)లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (GCC) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

*** ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ**

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్‌కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు.

## బెంగాల్‌లో అదానీ భారీ పెట్టుబడులు.. ఏకంగా రూ. లక్ష కోట్లు!

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## రిజర్వాయర్లలో నీరు నింపండి.. వర్షాలపై సీఎం ఆదేశం

రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు.

**ప్రధాన నదులకు వరద హెచ్చరికలు**

గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత వర్షాలకు గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి, భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం నాటికి మొదటి, సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని వివరించారు.

## ఇరాన్ యుద్ధ హెచ్చరికలు.. భారత ఆర్థిక, రక్షణ రంగాలపై ప్రభావం

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ఈ యుద్ధం హిందూ మహాసముద్రం వరకు కూడా వ్యాపించవచ్చని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామం భారత్ ఇంధన దిగుమతులు, సముద్ర వాణిజ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఉద్రిక్తతలు హిందూ మహాసముద్రానికి వ్యాపిస్తే, అది భారత వాణిజ్య, ఇంధన భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి సలహాదారుగా ఉన్న యహ్యా రహీం సఫావి ఈ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ మరిన్ని దాడులకు పాల్పడితే, యుద్ధాన్ని మరింత విస్తృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఈ పోరాటం ఇప్పటికే పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి నుంచి ఎర్ర సముద్రానికి విస్తరించింది. యుద్ధం కొనసాగితే, హిందూ మహాసముద్రం, ఆపై ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నట్టు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోను విడుదల చేసింది. ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారి ఒకరు హిందూ మహాసముద్రం గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించగా, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్ర తీరం, కీలకమైన బాబ్ అల్‌మందబ్ జలసంధిపై పట్టు బిగించారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు కోసం ఇరాన్, అమెరికా పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా హెచ్చరికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సంక్షోభం హిందూ మహాసముద్రానికి విస్తరిస్తే, మధ్యప్రాచ్యం, ఐరోపా, ఆఫ్రికాలతో భారత్‌ను కలిపే వాణిజ్య మార్గాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. భారత్ తన ముడి చమురు అవసరాల్లో అధిక భాగాన్ని మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటోంది.

## చిన్న వ్యాపారులకు ఊరట.. UPI ఛార్జీలపై NPCI స్పష్టత

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూ. 2,000కు మించిన లావాదేవీలపై కొత్తగా విధించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) దేశంలోని మెజారిటీ వ్యాపారులపై ఎలాంటి ప్రభావం చూపదని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్పష్టం చేసింది. డిజిటల్ చెల్లింపులు స్వీకరించే వ్యాపారుల్లో దాదాపు 75 శాతం మందికి ఈ కొత్త నిబంధన వర్తించదని ఎన్‌పీసీఐ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ దిలీప్ అస్బే తెలిపారు. నేడు జరిగిన ఎస్‌బీఐ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్ కాంక్లేవ్‌లో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. భారత్‌లో ప్రస్తుతం 60 మిలియన్లకు పైగా ప్రత్యేక యూపీఐ మర్చంట్లు ఉన్నారని, వారిలో 75 శాతం మంది ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీని నమోదు చేయలేదని దిలీప్ అస్బే వివరించారు. ఈ కారణంగా ఎండీఆర్ విధానం వల్ల అత్యధిక శాతం మంది చిన్న, మధ్య తరహా వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ ఎండీఆర్ భారం అధికంగా పెద్ద వ్యాపార సంస్థలపైనే పడుతుందని అస్బే తెలిపారు. మొత్తం ఎండీఆర్ విలువలో దాదాపు 80 శాతం... వార్షికంగా రూ. 1,000 కోట్ల కంటే ఎక్కువ స్థూల సరుకుల విలువ (జీఎంవీ) కలిగిన వ్యాపారుల నుంచి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన మొత్తంలో దాదాపు సగం... రూ. 1 కోటి కంటే ఎక్కువ వార్షిక జీఎంవీ ఉన్న వ్యాపారాల నుంచి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పెద్ద వ్యాపారుల్లో చాలామంది ఇప్పటికే క్రెడిట్ కార్డ్ చెల్లింపులను అంగీకరిస్తున్నారని, వారికి ఇలాంటి లావాదేవీ ఛార్జీల గురించి అవగాహన ఉందని అస్బే గుర్తుచేశారు. అందువల్ల వారు ఈ అదనపు భారాన్ని కస్టమర్లపై మోపే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, మొత్తం వ్యాపారుల విలువలో దాదాపు 10 శాతం మంది ఈ ఎండీఆర్ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడానికి ప్రయత్నించే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ, అలాంటి ఛార్జీలు కస్టమర్లపై పడకుండా బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లు, ఇతర భాగస్వాములతో కలిసి ఎన్‌పీసీఐ పర్యవేక్షిస్తుందని హామీ ఇచ్చారు. "వినియోగదారుడిపై ఛార్జీ పడే నిజమైన ప్రమాదం మొత్తం లావాదేవీల విలువలో కేవలం 10 శాతానికే పరిమితం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త ఎండీఆర్ విధానం వల్ల యూపీఐ లావాదేవీల సంఖ్య లేదా విలువపై గణనీయమైన ప్రభావం ఉండదని దిలీప్ అస్బే ధీమా వ్యక్తం చేశారు.

## నీట్ పీజీ ఫలితాలు విడుదల

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ఈ ఫలితాలను గురువారం అధికారిక వెబ్‌సైట్ natboard.edu.inలో అందుబాటులో ఉంచింది. ఆగస్టు 30న ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. జైపూర్‌లోని రెండు కేంద్రాల్లో సమస్యలు తలెత్తిన అభ్యర్థులకు రీఎగ్జామ్ కూడా నిర్వహించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ రోల్ నంబర్ ఆధారంగా ఫలితాలను, ర్యాంకు వివరాలను చెక్ చేసుకోవచ్చు.

**వివిధ కేటగిరీల కటాఫ్ స్కోర్లు**

- ఈ ఫలితాలతో పాటు వివిధ కేటగిరీలకు సంబంధించిన క్వాలిఫైయింగ్ కటాఫ్ మార్కులను కూడా NBEMS ప్రకటించింది. మొత్తం 720 మార్కులకు గాను కటాఫ్ స్కోర్లను ఇలా నిర్ధారించారు:
- జనరల్ / EWS: 50వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 262
- జనరల్ PwBD: 45వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 244
- SC / ST / OBC (PwBDతో సహా): 40వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 226

ఈ కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారు.

**ఫలితాలు చెక్ చేసుకునే విధానం**

అభ్యర్థులు తమ ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు కింద పేర్కొన్న పద్ధతిని అనుసరించవచ్చు:

1. ముందుగా అధికారిక వెబ్‌సైట్ natboard.edu.inను సందర్శించాలి.
2. హోమ్‌పేజీలోని 'ఎగ్జామినేషన్స్' సెక్షన్‌కు వెళ్లాలి.
3. అక్కడ 'నీట్ పీజీ' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
4. 'నీట్ పీజీ 2026' సెక్షన్‌పై క్లిక్ చేసి, 'రిజల్ట్స్' లింక్‌ను ఓపెన్ చేయాలి.
5. ఫలితాల పీడీఎఫ్ ఫైల్ ఓపెన్ అవుతుంది. అందులో మీ రోల్ నంబర్ ద్వారా ఫలితాన్ని సరిచూసుకోవచ్చు.

*** స్కోర్‌కార్డులు, ఆన్సర్ కీ ఎప్పటినుంచంటే..**

అభ్యర్థుల వ్యక్తిగత స్కోర్‌కార్డులను అక్టోబర్ 1, 2026 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని NBEMS తెలిపింది. ఈ స్కోర్‌కార్డులు ఆరు నెలల పాటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. వీటిని పోస్ట్ లేదా ఈమెయిల్ ద్వారా పంపబోమని, అభ్యర్థులే డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్టోబర్ 1న లేదా ఆ తర్వాత ఫైనల్ ఆన్సర్ కీని కూడా విడుదల చేయనున్నారు. అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో ప్రశ్నల ఐడీ, సరైన సమాధానం,

## వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఈ మేరకు ఒక అధికారిక మెమోరాండం విడుదల చేసింది. దీని ప్రకారం, రక్షణ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాలతో సహా అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శుక్రవారం నాడే జీతాలు చెల్లించనున్నారు. అదే రోజున కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా పెన్షన్లు అందజేస్తారు. ఈ ముందస్తు చెల్లింపులను అక్టోబర్ బకాయిలలో సర్దుబాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సంపాదకీయం

### సిద్ధాంతం కంటే ప్రగతే ముఖ్యం

# చైనా ఆర్థిక అద్భుతం వెనుక అసలు రహస్యం

ప్రపంచంలో కమ్యూనిజం విఫలమైందా అంటే, 'అవును' అనేవారి సంఖ్యే ఎక్కువ. ముఖ్యంగా సోవియెట్ యూనియన్ పతనమైన తరువాత ఈ వాదనకు మరింత బలం చేకూరింది. ఇక యుగోస్లేవియా విచ్ఛిన్నం కావడం, ఆధునిక సమాజంలోనే అత్యంత హేయమైన రక్తచరిత్రతో విభజన జరగడం ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రస్తుతం వెనిజులా పరిస్థితి దయనీయంగా ఉంటే, క్యూబా ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. కానీ జన చైనా (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) కమ్యూనిస్టు పరిపాలనలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడమే కాకుండా, శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. అయితే చైనాను 'క్యాపిటలిస్టిక్ కమ్యూనిజం' అంటారు గిట్టని వాళ్లు. అది వేరే విషయం. కానీ మనకంటే రెండు సంవత్సరాలు ఆలస్యంగా స్వాతంత్ర్యాన్ని పొందిన దేశం, ఈరోజు వేగవంతమైన అభివృద్ధిలో అమెరికాను తలదన్నే స్థాయికి ఎలా ఎదగగలిగింది? ఇక్కడ చైనా నేపథ్యాన్ని పరిశీలిస్తే—స్వాతంత్ర్యం కోసం మనం కేవలం బ్రిటీష్ వారితో పోరాడితే సరిపోయింది. అయితే చైనా పోరాటం భారత స్వాతంత్ర్య పోరాటం మాదిరిగా ఒక్క విదేశీ వలస పాలన నుండి విముక్తి కోసం మాత్రమే జరిగినది కాదు. పాశ్చాత్య సామ్రాజ్యవాద ఆధిపత్యం, జపాన్ దురాక్రమణ, దేశీయ రాజరికం మరియు అంతర్యుద్ధాల నుండి చైనాను ఒక స్వతంత్ర, ఐక్య గణతంత్ర రాజ్యంగా మార్చుకోవడానికి జరిగిన సుదీర్ఘ విప్లవ పోరాటంగా దీనిని అభివర్ణించవచ్చు. బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, జర్మనీ, జపాన్ వంటి దేశాలు చైనాను తమ అధీనంలోకి తెచ్చుకుని, తమ వ్యాపారాలకు అనువుగా మార్చుకున్నాయి. బ్రిటిష్ వారు చైనా ప్రజలతో నడిపిన వ్యాపారం నల్లమందు వ్యాపారం. దానిని అడ్డుకోవడానికి చైనా బ్రిటిష్ వారితో చేసిన యుద్ధంలో ఓడిపోయింది; దాని పర్యవసానమే హాంకాంగ్‌ను బ్రిటిష్ వారికి అప్పగించాల్సి రావడం. ఆ కాలాన్ని చైనా ప్రజలు ఇప్పటికీ 'అవమానకరమైన శతాబ్దం' గా చెప్పకుంటారు. అటువంటి చైనా ఈరోజు ప్రపంచంలో సంపన్నులను తయారు చేయడంలో అమెరికాను ద్వితీయ స్థానానికి నెట్టి, తాను ప్రథమ స్థానంలో నిలిచింది. ఒకప్పుడు పేదరికంతో, ఆకలి చావులతో అల్లాడిన దేశం నేడు అమెరికా తర్వాత ద్వితీయ ఆర్థిక శక్తిగా ఎదగడం ప్రపంచ చరిత్రలోనే ఒక ఆశ్చర్యకరమైన అంశం. 1912 లోనే రాజరికాన్ని పారద్రోలి, 'రిపబ్లిక్ ఆఫ్ చైనా'గా అవతరించినప్పటికీ, అంతర్యుద్ధాలతో బలహీనపడి మరలా జపాన్ దురాక్రమణకు గురై కొంత భాగాన్ని కోల్పోవడమే కాక, భయంకరమైన ఊచకోతను చవిచూసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోవడంతో చైనాకు విముక్తి లభించింది. మావో ఒకనాడు తన సైన్యంతో దాదాపు 9,000 కిలోమీటర్లు సుదీర్ఘంగా సాగించిన లాంగ్ మార్చ్.. చైనాను కమ్యూనిస్టు దేశంగా తీర్చిదిద్దింది. 1949 అక్టోబరులో మావో అధికారికంగా 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా'ను ప్రకటించే నాటికి అది అత్యంత నిరుపేద దేశంగానే ఉండేది. అప్పుడు మొదలైన కమ్యూనిస్టు పాలన ఆరంభంలో—మావో నాయకత్వపు తొలి రోజుల్లోనే ఘోరంగా విఫలమైంది. వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి సాధించాలని మావో తీసుకొచ్చిన 'గ్రేట్ లీప్ ఫార్వర్డ్' విధానం తీవ్ర వైఫల్యాన్ని చవిచూసింది. ఆ తర్వాత 'సాంస్కృతిక విప్లవం' పేరుతో జరిగిన గందరగోళం ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీసింది. అయితే మావో మరణానంతరం అధికారంలోకి వచ్చిన డెంగ్ జియావోపింగ్ చైనా రూపురేఖలను సమూలంగా మార్చివేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు చైనా పాలకులు తమ దేశాభివృద్ధి దినదిన ప్రవర్ధమానమయ్యేలా కృషి చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. చైనాకు, మనకు మధ్య సరిహద్దు వివాదాల నుండి మొదలుకొని ఆధ్యాత్మిక వివాదాల వరకు ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నాయి. చైనా విధానాల్లో సామ్రాజ్యవాద ఛాయలు కూడా కనిపిస్తాయి. కానీ వారి అభివృద్ధి ఎజెండాను మాత్రం మనం ఒప్పకుని తీరాల్సిందే. వారికి ఉన్న వనరులన్నీ మనకూ ఉన్నాయి. వారికీ, మనకూ హిమాలయాలు సరిహద్దుగా ఉండటమే కాకుండా, అక్కడి నుండి వచ్చే నదులే రెండు దేశాల జలవనరులకు, వ్యవసాయానికి మూలస్తంభాలుగా ఉన్నాయి. వారికి మాదిరిగానే మనకూ ఉష్ణమండల, సమశీతోష్ణ మండల ప్రాంతాలు, ఎడారులు, మంచుకొండలు ఉన్నాయి. చైనాతో పోలిస్తే మనకు మరింత మెరుగైన తీరప్రాంతం ఉన్నది; వ్యవసాయానికి అనువైన భూమి కూడా వారికంటే మనకే ఎక్కువ. మనకంటే వైశాల్యంలో మూడు రెట్లు పెద్దదైనప్పటికీ, పశ్చిమ మరియు ఉత్తర చైనాలోని చాలా భూభాగం నివాసయోగ్యంగా ఉండదు. మనం ఏడు దేశాలతో సరిహద్దును పంచుకుంటుంటే, చైనా 14 దేశాలతో సరిహద్దును పంచుకుంటున్నది. ఒకరకంగా చూస్తే వారికంటే మనకే భౌగోళికంగా కొన్ని అనుకూలతలు ఎక్కువ ఉన్నాయి. కానీ ఎందుకు మనం ఆ స్థాయిలో ఎదగలేకపోయాం? ఏకపార్టీ పాలన, కమ్యూనిస్టు నియంతృత్వం వల్ల ప్రజలు ప్రభుత్వ నియంత్రణలో ఉంటారని, ప్రభుత్వం ఎవరినైనా కట్టడి చేయగలుగుతుందని కొందరు అంటారు. మరి అదే తరహా పాలన ఉన్న సోవియెట్ రష్యా ఎందుకు పారిశ్రామికీకరణలో, ఆర్థికంగా నిలబడటంలో వెనుకబడింది? మనం నిశితంగా గమనిస్తే, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను అధికారికంగా ప్రకటించిన మావో నుండి నేటి షీ జిన్‌పింగ్ వరకు పాలకులు నిరంతరం దేశ సమగ్ర పురోగతికి ఊతమిచ్చే అంశాలపైనే దృష్టి పెట్టారు. వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి కోసం మావో తలపెట్టిన విధానాలు విఫలమై ఉండవచ్చు; కానీ వారు ఆ ఓటమి నుంచే కొత్త పాఠాలు నేర్చుకున్నారు. అందుకే మావో తర్వాత అధికారంలోకి వచ్చిన డెంగ్ జియావోపింగ్ మావోను పూర్తిగా తప్పపట్టలేదు. మావో లక్ష్యాలకు ఆధునిక రూపురేఖలు దిద్ది 'ఓపెన్ డోర్ పాలసీ'ని ప్రవేశపెట్టారు. "పిల్లి నల్లదా, తెల్లదా అన్నది ముఖ్యం కాదు; అది ఎలుకను పడుతుందా లేదా అన్నదే ముఖ్యం" అనే సూత్రంతో కమ్యూనిస్టు దేశమైనప్పటికీ పెట్టుబడిదారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తీరప్రాంతాలను ప్రత్యేక ఆర్థిక మండళ్లు గా తీర్చిదిద్ది, విదేశీ పెట్టుబడిదారులకు తక్కువ ధరకే లీజుకు భూములు ఇచ్చి, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించారు. అయితే భూమి హక్కులు మాత్రం ఎప్పటికీ ప్రభుత్వానివే. ఉన్న మానవ వనరులను ఉపయోగించుకుని చౌకగా వస్తువులు తయారు చేసి భారీ ఎత్తున ఎగుమతులు ప్రారంభించారు. మానవ వనరులను ఉపయోగించుకోవడమంటే పౌరుడి మెడపై కత్తి పెట్టి బలవంతంగా పని చేయించుకోవడం కాదు; పౌరులే సొంతంగా పరిశ్రమలు స్థాపించేలా ప్రోత్సహించి, ప్రతి ఇంటినీ ఒక కుటీర పరిశ్రమగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక పౌరుడు పరిశ్రమ ప్రారంభించాలనుకుంటే చాలు—'ప్లగ్ అండ్ ప్లే' పద్ధతిలో అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడమే కాకుండా, ప్రభుత్వమే పూచీకత్తుగా ఉండి రుణాలు ఇప్పిస్తుంది. అంతటితో ఆగకుండా మార్కెటింగ్ బాధ్యతను కూడా తానే తీసుకుంటుంది. మన దేశంలో సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్ లాంటి ప్రవాస భారతీయులను చూపిస్తూ, ప్రపంచ దిగ్గజ టెక్ కంపెనీలకు మనవాళ్లే సీఈఓలని గర్వపడుతుంటాం. వారికున్న నాయకత్వ లక్షణాలు, సాంకేతిక ప్రతిభ మనకు నిస్సందేహంగా గర్వకారణమే. కానీ వారి ప్రతిభను మన దేశం ఇక్కడే పూర్తిగా ఉపయోగించుకోలేకపోవడాన్ని సమర్థించలేం. అదే సమయంలో చైనాకు చెందినవారు ఎవరూ అటువంటి పాశ్చాత్య బహుళజాతి కంపెనీలకు సీఈఓలు కాలేదు కాబట్టి, వారి దగ్గర సాంకేతిక నిపుణులు లేరనుకుంటే అది పొరపాటే అవుతుంది. చైనా తమ నిపుణులను తమ దేశ ప్రయోజనాల కోసమే వినియోగించుకునే వ్యవస్థను పటిష్టంగా నిర్మించుకుంది. వారి దగ్గర అంతటి నైపుణ్యం లేకపోతే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), 5G, ఎలక్ట్రిక్ వాహనాలు (EV), స్పేస్ టెక్నాలజీ, సోలార్ ఎనర్జీ వంటి భవిష్యత్ రంగాలలో ప్రపంచ ఆధిపత్యాన్ని ఎలా సాధించగలుగుతారు? తన దేశంలో అన్ని రంగాలలో పురోగమిస్తూనే, అంతర్జాతీయంగా మౌలిక వసతుల కల్పనలో పెట్టుబడులు పెడుతూ ప్రపంచ సరఫరా వ్యవస్థను (Global Supply Chain) తన నియంత్రణలోకి తెచ్చుకుంటున్నది. దీనికంతటికీ కారణం ఒక్కటే— అవమానకరంగా శతాబ్దాలు గడిపిన చైనా పౌరులను ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలబెట్టడం కోసం చైనా పాలకుల నిరంతర ఆలోచన మరియు నిర్విరామ కృషి. కార్ల్ మార్క్స్ సిద్ధాంతీకరించిన కమ్యూనిజానికి, ఆయన చెప్పిన పెట్టుబడి సూత్రాన్ని తమకు అనుకూలంగా భాష్యం చెప్పకున్న చైనా పాలకుల విధానాన్ని, అభివృద్ధి ఎజెండాను చివరికి సిద్ధాంతవాదులైన కమ్యూనిస్టులు సైతం కాదనలేరు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 25

September 25


రేమెళ్ళ అవధానులు

* 1916: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భాజపా హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ జననం (మ.1968).
* 1948: భౌతిక శాస్త్ర ఆచార్యుడు, వేదాలను కంప్యూటరీకరించిన శాస్త్రవేత్త రేమెళ్ళ అవధానులు జననం.(చిత్రంలో)
* 1948: ప్రఖ్యాత భారతీయ గుండె వ్యాధి నిపుణుడు భూపతిరాజు సోమరాజు జననం.
* 1958: భారతీయ సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడు, సాహితీకారుడు ఉన్నవ లక్ష్మీనారాయణ మరణం (జ.1877).
* 1962: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు రాజు కులకర్ణి జననం.
* 1985: భారత స్వాతంత్ర సమరయోధుడు చెలికాని రామారావు మరణం (జ.1901).
* 2020: భారతీయ సినిమా గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం మరణం (జ.1946).

### మాజీ మంత్రి
## వైఎస్ వివేకా హత్యకేసులో ఈడీ దూకుడు




కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుదర్యాప్తులో ఈడీ దూకుడు పెంచింది. ఈ కేసులో నిందితులు ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొంది. ఇప్పటికే అప్రూవర్ దస్తగిరి ఈడీ విచారించింది. సునీల్ యాదవ్‌ను ఇవాళ 9 గంటలపాటు విచారించిన ఈడీ అధికారులు.. రేపు కూడా విచారణకు రావాలని ఆదేశించారు. సునీల్‌తో పాటు ఆయన భార్య బ్యాంకు ఖాతాల వివరాలను కూడా తెలుసుకున్నట్టు సమాచారం. వివేకా హత్య కోసం రూ.40 కోట్లు సుపారీ చెల్లించేలా ఒప్పందం చేసుకుని.. నిందితుడు షేక్ దస్తగిరి (అప్రూవర్‌గా మారారు) కి అడ్వాన్స్ కింద రూ. కోటి ఇచ్చారంటూ సీబీఐ తేల్చిన నేపథ్యంలో ఈ ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. దీని వెనక పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌తోపాటు వైఎస్సార్ కడప జిల్లాలోని నిందితుల నివాసాల్లో మొత్తం 7 చోట్ల ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సంబంధించి హైదరాబాద్ కోకాపేట గోల్డెన్‌మైన్ రోడ్డులోని ఓపెన్‌స్కై స్పేస్ అపార్ట్‌మెంట్‌లోని నివాసంలోనూ, పులివెందులలోని ఇంట్లోనూ తనిఖీలు చేశాయి. పులివెందులలో అవినాష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు దేవిరెడ్డి శివశంకరరెడ్డి, యాదటి సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి, తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఎర్ర గంగిరెడ్డి నివాసాల్లోనూ సోదాలు నిర్వహించాయి. అవినాష్‌రెడ్డి నివాసం నుంచి లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదు, 2 బ్యాంకు లాకర్ల తాళాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నివాసాల నుంచి పలు కీలకపత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా దస్తగిరి, సునీల్ యాదవ్ ఇచ్చిన వివరాల ఆధారంగా ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డిలను విచారించనుంది.

### మారిషస్ గడ్డపై డా. గజల్ శ్రీనివాస్ కు
## "విశ్వ సంగీత శాంతి దూత" పురస్కారం

పోర్ట్ లూయిస్, మారిషస్: 108 అడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి అతి పెద్ద విగ్రహం కలిగిన హరి హర దేవస్థాన ప్రాంగణంలో ప్రపంచ ప్రఖ్యాత గజల్ గాయకుడు ట్రిపుల్ గిన్నీస్ ప్రపంచ రికార్డుల గ్రహీత డా. గజల్ శ్రీనివాస్ ను "విశ్వ సంగీత శాంతి దూత" పురస్కారం తో మారిషస్ దేశాధ్యక్షులు శ్రీ ధరమ్ బీర్ గోకుల్ సత్కరించారు. డా.గజల్ శ్రీనివాస్ వివిధ ప్రపంచ భాషలలో గానం చేసి సనాతన ధర్మం, అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలను ప్రచారం చేయడం ఎంతో స్ఫూర్తి దాయకమని, హరి హర దేవస్థానం ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పురస్కారానికి డా. గజల్ శ్రీనివాస్ ఎంపిక చేయడం గొప్ప నిర్ణయమని శ్రీ ధరమ్ బీర్ గోకుల్ కొనియాడారు. మారిషస్ లో



డా.గజల్ శ్రీనివాస్ ప్రపంచ శాంతి, భారతీయ సంస్కృతి లపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తి దాయకమని ఆయన అన్నారు.

### సమాజంలో అలజడి సృష్టించేలా
## వైకాపా వ్యవహారశైలి: మంత్రి నాదెండ్ల



తెనాలి: రాజకీయ లబ్ధి కోసం సమాజంలో అలజడి సృష్టించేలా వైకాపా వ్యవహరిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గుంటూరు జిల్లా తెనాలి జనసేన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోవాల్సిన అంశాలను పక్కనపెట్టి అరాచక శక్తులను రంగంలోకి దించి ప్రజలకు భయపెట్టేలా నిరసనలు చేయటం సరికాదన్నారు. చాలా సందర్భాల్లో గొడ్డలి పార్టీ ముఠా నాయకులు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమాల్లోకి అరాచక శక్తులను తీసుకురావడం, రౌడీషీటర్లను ఉపయోగించటాన్ని ఖండించారు.

# గుజరాత్ సీఎం నారా లోకేశ్ భేటీ.. రెండు రాష్ట్రాల మధ్య 'కోస్ట్ టు కోస్ట్' కారిడార్

- **గుజరాత్‌తో ఏపీ భాగస్వామ్యం**
- **ఏపీ, గుజరాత్ మధ్య 'కోస్ట్ టు కోస్ట్' వాణిజ్య కారిడార్ ఏర్పాటుపై చర్చ**
- **గిఫ్ట్ సిటీ తరహాలో వైజాగ్, అమరావతిలో బిజినెస్ డిస్ట్రిక్టుల అభివృద్ధికి సహకారం కోరిన లోకేశ్**
- **గుజరాత్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమి కేటాయించాలని విజ్ఞప్తి**
- **విజయవాడ ఉత్సవ్‌కు రావాల్సిందిగా గుజరాత్ సీఎంకు ప్రత్యేక ఆహ్వానం**







ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు తీరప్రాంత రాష్ట్రాల పరస్పర సహకారంతో దేశాభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రతిపాదనలను ఆయన ముఖ్యమంత్రి ముందుంచారు. ముఖ్యంగా, గుజరాత్ పశ్చిమ తీరాన్ని, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన్ని కలుపుతూ 'కోస్ట్ టు కోస్ట్' వాణిజ్య కారిడార్ ఏర్పాటు ఆవశ్యకతను లోకేశ్ నొక్కిచెప్పారు. ఈ భేటీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక ప్రగతిలో కీలకమైన తీరప్రాంత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. తూర్పు తీరానికి గేట్‌వేగా ఉన్న ఏపీ, పశ్చిమ తీరంలో కీలకంగా ఉన్న గుజరాత్ సమన్వయంతో పనిచేస్తే సముద్ర, పోర్టుల ఆధారిత పరిశ్రమలు గణనీయమైన వృద్ధిని సాధిస్తాయని వివరించారు. గుజరాత్ మోడల్ స్ఫూర్తితోనే ఏపీలో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట వంటి నాన్‌మేజర్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణ, ప్రైవేట్ పోర్టుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను పంచుకునేందుకు 'కోస్ట్ టు కోస్ట్' లాజిస్టిక్స్, వాణిజ్య కారిడార్ ఎంతో ఉపకరిస్తుందని ప్రతిపాదించారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ (GIFT City) ఫ్రేమ్‌వర్క్‌ను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని ఆదర్శంగా తీసుకుని, ఏపీలోని విశాఖపట్నం, అమరావతి ప్రాంతాల్లో ఆధునిక బిజినెస్ డిస్ట్రిక్ట్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గిఫ్ట్ సిటీలో అమలు చేస్తున్న సింగిల్‌విండో క్లియరెన్స్, డెవలపర్లకు ఇచ్చే ప్రోత్సాహకాలపై తమకు అవగాహన కల్పించి, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఏపీలో సెమీకండక్టర్, గ్రీన్ హైడ్రోజన్ (కాకినాడ హబ్), ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల (కొప్పర్తి, ఓర్వకల్లు) ఏర్పాటు ద్వారా పారిశ్రామిక సప్లయ్ చైన్‌ను పటిష్ఠం చేస్తున్నామని సీఎంకు వివరించారు. అదేవిధంగా, అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ పున్నమి ఘాట్‌లో జరగనున్న 'విజయవాడ ఉత్సవ్'కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు కూడా రావాలని కోరారు. గుజరాత్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పం ఉందని, ఇందుకు అవసరమైన భూమిని కేటాయించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ వెంట రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ కూడా ఉన్నారు.

## మంత్రి ఫరూక్ సమక్షంలో నంద్యాలలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

- **ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరిన 200 మందికి పైగా వైసీపీ నేతలు, కార్యకర్తలు**
- **చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధిని చూసి టీడీపీలో చేరుతున్నామన్న నేతలు**
- **ఇటీవలే టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను**



ఏపీలో స్థానిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ వైసీపీకి వరుసగా షాకులు తగులుతున్నాయి. పలు చోట్ల కేడర్ పార్టీకి రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరుతున్నారు. తాజాగా, నంద్యాల నియోజకవర్గంలో నేతలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పార్టీకి రాజీనామా చేసి అధికార తెలుగుదేశం పార్టీలో చేరారు. నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో మాజీ సర్పంచ్ ఎల్లయ్యతో పాటు దాదాపు 200 మందికి పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. మరోవైపు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన కుమార్తె ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు ఆయన అనుచరులు పలువురు కూడా సైకిల్ ఎక్కేశారు. రాబోయే రోజుల్లో విజయనగరం జిల్లా వ్యాప్తంగా వైసీపీని వీడే నేతల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం..
# రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు బెయిల్

- **ఏపీ లిక్కర్ స్కామ్.. కీలక నిందితులకు బెయిల్**
- **రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు ఊరట**
- **ఈడీ స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు**
- **దేశం విడిచి వెళ్లొద్దంటూ కఠిన షరతులు**
- **రేపు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం**



ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం (లిక్కర్ స్కామ్) కేసులో కీలక నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఊరట లభించింది. ఈ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఈడీ స్పెషల్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఈ మేరకు కోర్టు తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా న్యాయస్థానం పలు కఠినమైన షరతులను విధించింది. నిందితులు దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే దర్యాప్తును ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశించింది. ఇద్దరు నిందితులు లక్ష రూపాయల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.వీరిద్దరూ దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు పిలిచినప్పుడు తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బెయిల్ ప్రక్రియ పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం వీరిద్దరూ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు రాగా, ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ, రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. తాజాగా వీరికి బెయిల్ లభించడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

## కాకినాడ లో కుండపోత వర్షాలు.. అధికారులకు పవన్ కీలక ఆదేశాలు

- **కాకినాడ జిల్లాలో భారీ వర్షా లపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్**
- **వర్షా లు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**
- **జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా**
- **పిఠాపురం సుద్దగడ్డ వాగు, ఉప్పాడ తీర ప్రాంత పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా**
- **నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన**



తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీవాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## దసరా ఉత్సవాలకు అసోం ప్రముఖులను
# ఆహ్వానించిన కేశినేని చిన్ని

- **విజయవాడ కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్న కేశినేని చిన్ని**
- **అసోంలో పర్యటించిన చిన్ని, మంత్రి సత్యకుమార్**
- **అసోం ఆరోగ్య మంత్రి, సీఎస్ లకు ఆహ్వానం**



విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పిస్తూ, ఇతర రాష్ట్రాల ప్రముఖులకు ఆహ్వానాలు అందించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలసి కేశినేని చిన్ని అసోం రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా అసోం ఆరోగ్య శాఖ మంత్రి అశోక్ సింఘాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కోటలను మర్యాదపూర్వకంగా కలిసి, ఇంద్రకీలాద్రిపై జరిగే విజయవాడ దసరా ఉత్సవాలకు రావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. అమ్మవారి దర్శనంతో పాటు విజయవాడ నగర ప్రాశస్త్యం, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసేలా రూపుదిద్దుకుంటున్న 'విజయవాడ ఉత్సవ్' ప్రత్యేక వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ నగరానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఇంద్రకీలాద్రి వైభవాన్ని, నగర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈసారి 'విజయవాడ ఉత్సవ్'ను ఎంతో అట్టహాసంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కేశినేని చిన్ని వెల్లడించారు.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. ఏపీలో పలు విమానాల దారి మళ్లింపు

- **ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షా లు**
- **విమానాల రాకపోకలకు అనుకూలంగా లేని వాతావరణం**
- **విశాఖ నుంచి విజయవాడ వెళ్లాల్సిన విమానం హైదరాబాద్‌కు దారి మళ్లింపు**




తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో ఉత్తరాంధ్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మరోవైపు భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఏపీలోని ప్రధాన విమానాశ్రయాలలో విమాన రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రన్‌వేలపై భారీగా నీరు చేరడం, దట్టమైన మేఘాలు ఆవరించడంతో విమానాశ్రయ అధికారులు పలు సర్వీసులను దారి మళ్లించడంతో పాటు మరికొన్నింటిని రద్దు చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి దారి మళ్లించగా, హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సిన స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. వాతావరణ పరిణామాలు అనుకూలించని దృష్ట్యా ప్రయాణికులు తమ విమాన సమయాలు, రాకపోకల తాజా సమాచారాన్ని ఆయా ఎయిర్‌లైన్స్ సంస్థల ద్వారా ముందస్తుగా సరిచూసుకోవాలని విమానాశ్రయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో మద్యం దుకాణాల లాటరీ వాయిదా



ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాల లాటరీ నిర్వహణ షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత సెప్టెంబర్ 30న లాటరీ నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, తాజాగా దానిని అక్టోబర్ 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. నవీకరణ (రెన్యువల్) కాని సుమారు 400 మద్యం దుకాణాలకు కొత్తగా దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈరోజు (గురువారం) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆసక్తి గల వ్యాపారులు గురువారం నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందిన దరఖాస్తుల ఆధారంగా అక్టోబర్ 5న లాటరీ నిర్వహించి, కొత్త లైసెన్సుదారులను ఎంపిక చేస్తారు. అయితే, ఒక దుకాణానికి కనీసం 10 దరఖాస్తులు వస్తేనే అక్కడ లాటరీ పద్ధతిని చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఈటీ) రెన్యువల్, లైసెన్స్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ. 1,268 కోట్ల ఆదాయం సమకూరినట్లు సమాచారం.

# ఏపీలో వాన బీభత్సం.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

- ఏపీలో పలు జిల్లాలను ముంచెత్తిన భారీ వర్షా లు
- 80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు
- విశాఖ రూరల్ తులాసినగర్‌లో అత్యధికంగా 236 మి.మీ. వర్షం
- కళింగపట్నం వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షం దంచికొడుతోంది. ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఈ వర్షాలకు అతలాకుతలమైంది. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఈ క్రమంలో రాష్ట్రంలో వర్షపాత వివరాలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 8:30 నుంచి గురువారం ఉదయం 7:00 గంటల మధ్య రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విశాఖపట్నం రూరల్ పరిధిలోని తులసినగర్‌లో 236 మి.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మధురవాడలో 218 మి.మీ., ఎండాడలో 210 మి.మీ., సీతమ్మధారలో 205 మి.మీ. చొప్పున వర్షం కురియడంతో విశాఖ నగరం జలమయమైంది. తీవ్ర వాయుగుండం నిన్న రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటింది. దీని ప్రభావం మరో 12 గంటల పాటు కొనసాగి, ఆ తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు చోట్ల ఈరోజు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

## 22ఏ నిషేధిత భూములపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




హైదరాబాద్: 22ఏ నిషేధిత భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ(GHMC), డీటీసీపీ(DTCP), హెచ్ఎండీఏ (HMDA) అనుమతి ఉంటే 22ఏ పరిధిలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.రాష్ట్ర వ్యాప్తంగా గత నెలరోజులుగా 22ఏ నిషేధిత భూముల అంశంపై వివాదం కొనసాగుతోంది. అధికారులు రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో యజమానులు ఆందోళనకు గురయ్యారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో కంటే ఇప్పుడు 3.50లక్షల పైచిలుకు ఎకరాల భూమిని 22ఏలో కొత్తగా చేర్చామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ చేర్చే క్రమంలో కొంత పొరపాటు జరిగిందని తెలిపింది. ఈ క్రమంలో నిషేధిత భూములతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, ఓపెన్ ప్లాట్లు, నివాస గృహాలను కూడా అధికారులు ఈ జాబితాలో చేర్చారు. దీంతో రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. దీనిపై భూ యజమానులతో పాటు విపక్షాలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. వీటన్నింటితో పాటు ప్రభుత్వం కూడా.. ఈ అంశంపై అధికారులతో కూలంకుషంగా చర్చించిన తర్వాత కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ముఖ్యంగా ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లోని నివాస గృహాలు ఎక్కువగా 22ఏ జాబితాలో ఉన్నాయి. అక్కడ భవనాలన్నీ ప్రభుత్వ అనుమతులతోనే నిర్మాణం జరిగాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వీటన్నింటికీ ఊరట లభించింది.

## విద్యుత్ లైన్లు తగిలి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు
# అన్ని విధాలా సాయం అందిస్తాం: మంత్రి గొట్టిపాటి

- విద్యుత్ ప్రమాదాలు, భారీ వర్షా లపై గొట్టిపాటి సమీక్షా సమావేశం
- విద్యుదాఘాతంతో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి
- విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే ఫిర్యాదు చేయాలా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన విద్యుత్ ప్రమాదాలు, ఉత్తరాంధ్రలో వాయుగుండం ప్రభావంతో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల మండలంలో తెగిపడిన ఎల్‌టీ విద్యుత్ లైన్ తాకి తల్లి, కుమారుడు మృతి చెందిన ఘటనతో పాటు, నర్సీపట్నం నాతవరంలో విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోవడంపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన నాగరాజుకు అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ వైర్లు, స్తంభాల స్థితిగతులను నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేశారు. వాయుగుండం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తుండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈపీడీసీఎల్ పరిధికి అవసరమైన అదనపు సిబ్బందిని, విద్యుత్ మెటీరియల్‌ను ఎస్‌పీడీసీఎల్ నుంచి పంపించినట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలినా, వైర్లు తెగిపడినా తక్షణమే సంబంధిత సమీప కార్యాలయాలకు ఫిర్యాదు చేసేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఉన్న చోట వాతావరణం అనుకూలించిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

## ‘ఐబొమ్మ’ రవికి స్వల్ప ఊరట




హైదరాబాద్: పైరసీ వెబ్‌సైట్ ‘ఐబొమ్మ’ కేసులో ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవి కి నాంపల్లి కోర్టులో తాత్కాలిక ఉపశమనం దక్కింది. దర్యాప్తులో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసులు సీజ్ చేసిన రవి బ్యాంకు ఖాతాలను తిరిగి సాధారణ లావాదేవీల కోసం ఉపయోగించుకోవచ్చని న్యాయస్థానం గురువారం స్పష్టం చేసింది. అయితే, ఆయా ఖాతాల్లో నిలిచిపోయిన సుమారు రూ.3 కోట్ల నిధులను విత్‌డ్రా చేసుకునేందుకు లేదా ఖర్చు చేయడానికి ప్రస్తుతానికి అనుమతి లేదని తేల్చి చెప్పింది. తన బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ కావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కనీసం నిత్యావసరాలు, వైద్య ఖర్చులు భరించడానికి కూడా డబ్బులు లేక తన కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని రవి నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఖాతాల్లోని రూ.3 కోట్లను రిలీజ్ చేసేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు రవి వ్యక్తిగత ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు లావాదేవీల కోసం ఆ బ్యాంకు ఖాతాల నిర్వహణకు మాత్రమే అవకాశం కల్పించింది. కేసు దర్యాప్తులో ఉన్నందున ఖాతాల్లో ముందు నుంచీ ఉన్న రూ.3 కోట్లపై ఫ్రీజ్ ఆర్డర్ అలాగే కొనసాగుతుందని పేర్కొంది.

## హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం..
# నిందితుడి కోసం పోలీసుల గాలింపు

- గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
- హైదరాబాద్‌లో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
- ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత
- కుటుంబానికి అండగా ఉంటామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ హామీ
- పరారీలో ఉన్న నిందితుడి కోసం సైఫాబాద్ పోలీసుల గాలింపు



భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

**ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం**

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. “గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దురదృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు” అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీ ఇళ్లలో
# ఏసీబీ సోదాలు



హైదరాబాద్: పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్(పీసీఎస్) మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీ ఇళ్లలో ఏసీబీ సోదాలు చేస్తోంది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మొత్తం 8 చోట్ల అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పుప్పాలగూడలోని భీమ్‌రెడ్డి బినామీ కోమటి వెంకటేశ్ ఇంట్లో సోదాలు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్టు చేసింది. ఆయనకు రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించింది.

## బాలాపూర్‌కు ముందే రికార్డు మోత..
# హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డూ!

- రాజేంద్రనగర్ కీర్తి రిచ్‌మండ్‌లో కోటి దాటిన గణేశ్ లడ్డూ వేలం
- శక్తిమాన్ బృందం రూ.1.01 కోట్లకు లడ్డూ కైవసం
- గతేడాది ఇదే కమ్యూనిటీలో లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన రికార్డు
- రేపు జరగనున్న బాలాపూర్ లడ్డూ వేలంపై ఉత్కంఠ
- గతేడాది బాలాపూర్ లడ్డూ ధర రూ.35 లక్షలుగా నమోదు





హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోలిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్క్‌ను దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది. రేపు చారిత్రక బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం జరగనుంది. 1994లో కేవలం రూ.450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, మూడు దశాబ్దాల్లో లక్షల రూపాయలకు చేరింది. గతేడాది బాలాపూర్ లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకోగా, 2024లో రూ.30.01 లక్షలు పలికింది. ఈసారి పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన బాలాపూర్ గణపయ్య లడ్డూ (21 కిలోలు) కొత్త రికార్డు సృష్టిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీలలో కోట్లలో ధర పలుకుతున్న నేపథ్యంలో బాలాపూర్ లడ్డూ ఆ రికార్డులను అందుకుంటుందా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బాలాపూర్ వేలం అనంతరం జరిగే గణేశుడి శోభాయాత్రతోనే నగర నిమజ్జనం ప్రారంభం కావడం ఆనవాయితీ.

## అనర్హత వేటు.. సుప్రీంలో
# దానం నాగేందర్‌కు చుక్కెదురు

ఢిల్లీ: సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు చుక్కెదురైంది. అనర్హత వేటు విషయంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి.. మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఘర్‌వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని.. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకొని హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుబట్టారు.

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్ దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..



# పురుషులు హౌస్ హస్బెండ్‌గా ఎందుకు ఉండకూడదు?: మదురై ధర్మాసనం



చెన్నై (ప్యారిస్): మహిళలు హౌస్ వైఫ్‌లా ఉన్నట్లు పురుషులు హౌస్ హస్బెండ్‌గా ఎందుకు ఉండకూడదని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తిరువణ్ణామలైకి చెందిన వైద్య దంపతుల విడాకులకు సంబంధించి జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో... మారుతున్న సమాజంలో మహిళల ఉపాధికి వివాహం అడ్డంకిగా ఉందని భావించి వైవాహిక జీవితానికి దూరమయ్యే వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొంది. కుటుంబ వ్యవస్థలో, పని వాతావరణంలో స్త్రీ, పురుషులు ఇద్దరికి సమాన హక్కులు, అవగాహన అవసరం అని తెలిపింది. ఉద్యోగం చేసే మహిళలు తమ ఉద్యోగం, వృత్తిపరమైన ఎదుగుదలకు వివాహాన్ని అడ్డుగా భావించి భయపడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేసింది. దీంతో ఇటీవలి కాలంలో వివాహం చేసుకోకుండా ఉండిపోతున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితి మారాలంటే ఇంటి బాధ్యతలను భర్తలు పంచుకునేందుకు ముందుకు రావాలని సూచించింది. సమాజంలో మహిళలు హౌస్ వైఫ్‌గా ఉన్న విధంగా.. అవసరమైతే పురుషులు ఇంటి బాధ్యతలు స్వీకరించే హౌస్ హస్బెండ్‌గా ఉండేందుకు సంకోచించకూడదని పేర్కొంది. స్త్రీ, పురుషులు ఈవిధంగా ఉంటేనే భవిష్యత్తులో వివాహం, కుటుంబ వ్యవస్థను రక్షించగలమని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ కేసు విషయంలో పిల్లల క్షేమాన్ని పరిగణనలోకి తీసుకుని రూ.2.50 కోట్లు ఇచ్చేందుకు భర్త అంగీకరించారు. అందుకు భార్య ఆమోదం తెలపడంతో పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరయ్యాయి.

## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

**: రాహుల్ గాంధీ**

దిల్లీ: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో (Election Commission) విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ (Rahul Gandhi) తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని



చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకి ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ అప్రూవర్‌గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష.. ఐఐటీ బాంబే పరీక్షలు వాయిదా

విద్యార్థి సాహిల్ వాకోడే ఆత్మహత్యపై నిరసనలు వ్యక్తమవుతున్న వేళ.. మిడ్ సెమిస్టర్ పరీక్షలను ఐఐటీ బాంబే వాయిదా వేసింది. ఈ నెల 2627 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను అక్టోబరు 1011కు వాయిదా వేసింది. మరోవైపు.. తమ కుమారుడిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సాహిల్ తల్లిదండ్రులు ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష ప్రారంభించారు. ''నా బిడ్డను వేధించిన వారిని జైలులో పెట్టాలి. విద్యాసంస్థలో తాను పదేపదే కులవివక్షను ఎదుర్కొన్నట్లు అతడు మాకు చెప్పాడు'' అని సాహిల్ తండ్రి తెలిపారు. అంతకుముందు సాహిల్ తల్లిదండ్రులు 'జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్'





ఛైర్మన్‌ను కలిసి.. తమ కుమారుడి మరణంపై దర్యాప్తు జరపాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మరోవైపు.. విద్యార్థి కుటుంబానికి సంఘీభావంగా ఐఐటీ బాంబే వద్దకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్, ఆ పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ప్రొఫెసర్ సూర్యనారాయణ 2024లో పంపినట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తోటి విద్యార్థుల అడ్మిషన్ కేటగిరీలు, జేఈఈ (అడ్వాన్స్‌డ్) ర్యాంకులు, గేట్ స్కోర్‌ల గురించి అడగొద్దని విద్యార్థులకు సూచించినట్లు అందులో ఉంది. అటువంటి ప్రశ్నలతో వారి సామాజిక వర్గం, రిజర్వేషన్ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సాహిల్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన్ను ఐఐటీ యాజమాన్యం ఇప్పటికే సెలవుపై పంపింది.

## జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!

ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు రావడంతో విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. సీఈసీపై నోటీసులకు





సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టడం మూడోసారి కావడం గమనార్హం. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది. తాజాగా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరమీదకు రావడంతో ప్రధాన కమిషనరు తొలగింపునకు విపక్షాలు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

## అప్పటి నుంచి స్కూల్‌కు వెళ్లలేదు: ప్రియాంక గాంధీ

తాను 12 ఏళ్ల వయసు నుంచే ఇంటి చదువులకు పరిమితమైనట్లు కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ తెలిపారు. తన నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మరణంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. కేరళలోని తన సొంత నియోజకవర్గమైన వయనాడ్‌లో పర్యటించిన ఆమె.. ఓ స్కూల్‌లో విద్యార్థులతో ముచ్చటించారు. ''మా నాన్నమ్మ ఇందిరాగాంధీతో ఒకే ఇంట్లో నివసించేవాళ్లం. నాకు 12 ఏళ్లప్పుడు ఆమె హత్యకు గురయ్యారు. అప్పటినుంచి పాఠశాలకు వెళ్లలేదు. రాహుల్ గాంధీ, నేను ఇంటివద్దే స్కూల్ చదువు పూర్తి చేశాం. మాకు ఎక్కువగా స్నేహితులు ఉండేవారు కాదు. చాలా సమయం ఇంటికే పరిమితమయ్యేవాళ్లం'' అని ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తన ఇంట్లో పనిచేసిన ఓ మహిళ తనకు రోల్‌మోడల్ అని వెల్లడించారు. ''ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ.. ఆమె



నా పిల్లలను తల్లిలా చూసుకున్నారు. ఆమె పిల్లల్లో ఒకరు చనిపోయినప్పటికీ.. మరుసటి రోజు పనికి వచ్చారు'' అని చెప్పారు. భౌతికశాస్త్రం, గణితం, జీవశాస్త్రం తన ఫేవరెట్ సబ్జెక్టులని తెలిపారు. ఈ సంభాషణ సందర్భంగా, గిరిజన సంస్కృతిని జాతీయ సంపదగా పేర్కొన్న ప్రియాంక.. దానిని పరిరక్షించేందుకు కాంగ్రెస్ అనేక చర్యలు చేపట్టాలని భావిస్తోందని తెలిపారు.

## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! సీజేపీ

ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొంది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ''రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?'' అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. సీజేపీ కోకన్వీనర్ సౌరవ్ దాస్



మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

## యూపీ వ్యాపారవేత్త వినీత్ మనోచా హత్య కేసులో ట్విస్ట్

కాన్పూర్: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారవేత్త వినీత్ మనోచా (60) హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కిరాయి హంతకుడితో తండ్రిని చంపించినట్లు కుమారుడు సుబ్రత్ మనోచా అంగీకరించాడు. ఈ హత్యతో తన భార్య షాలు మనోచాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. అంతకుముందు సుబ్రత్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. భార్యే తన తండ్రిని హత్య చేయించిందని పేర్కొన్నాడు. కిరాయిహంతకుడిని నియమించి చంపించిందని ఆరోపించాడు. అయితే, అతడి ప్రవర్తన, ఇతరులు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులు షాలు, మాజీ ఉద్యోగి విశాల్ గౌతమ్‌లతోపాటు సుబ్రత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో అతడు నేరాన్ని అంగీకరించాడు. తానే విశాల్‌కు డబ్బులిచ్చి హత్య చేయించానని, ఒకవేళ పట్టుబడితే భార్య పేరు చెప్పాలని కోరానని పోలీసులకు చెప్పాడు. పోలీసులు షాలుకు క్లీన్



చిట్ ఇవ్వలేదు. ఈ ఘటనలో ఆమె పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆస్తి కోసమే హత్య చేయించాడా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. విశాల్ సమాచారం ప్రకారం.. వినీత్ మనోచాకు వేరే మహిళతో సంబంధం ఉంది. ఆమెకు పుట్టిన పిల్లలకు ఆస్తిని రాసేస్తాడనే ఉద్దేశంతో.. ముందుగానే తండ్రిని హత్య చేసేందుకు సుబ్రత్ పన్నాగం పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## 'మారిషస్‌ను శుభ్రంగా ఉంచుతున్నారు.. మరి భారత్‌లో ఎందుకీ దుస్థితి?'

పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో భారత్, మారిషస్‌లను పోలుస్తూ ఓ భారతీయ కంటెంట్ క్రియేటర్ చేసిన పోస్టు నెట్టింట వైరల్‌గా మారింది. మారిషస్‌లో భారత సంతతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని.. అక్కడివారు స్వచ్ఛతను పాటిస్తుండగా, స్వదేశంలో మన భారతీయులు ఎందుకు వెనుకబడ్డారని ఆయన ప్రశ్నించారు. మారిషస్‌లో పర్యటించిన విశాల్ భార్గవ అనే క్రియేటర్.. అక్కడ తనకు ఎదురైన అనుభవాన్ని వీడియోలో పంచుకున్నారు. ''మారిషస్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్న భారతీయులు.. భారత్ విషయంలో ఎందుకు ఆ పని చేయడం లేదు? మారిషస్‌లో 70 శాతం మంది భారత సంతతికి చెందిన వారే. కానీ, ఆ దేశం చాలా క్లీన్‌గా ఉంది. ఎవరూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరు.



చెత్తకుండీలను వాడతారు. బీచ్‌లు చాలా శుభ్రంగా ఉంటాయి. అయితే.. అది చాలా చిన్న దేశమని, కేవలం 12 లక్షల జనాభా ఉందని వాదించవచ్చు. మన దేశంలోని గోవాను తీసుకున్నా పరిశుభ్రత అంతంతే. వాస్తవానికి భారతీయులు పౌరస్పృహ లేనివారు కాదు. అయినప్పటికీ.. మన దేశంలో ఎందుకీ పరిస్థితి నెలకొంది?'' అని విశాల్ భార్గవ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈ వీడియో ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. భారతీయులు కూడా నిబంధనలు పాటిస్తారనీ, కానీ అధికార యంత్రాంగం వాటిని కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందనీ ఒకరు పేర్కొన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మరిన్ని చెత్తబుట్టలను అందుబాటులో ఉంచాలని మరొకరు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అనేది ఇంటినుంచే మొదలుకావాల్సిన పాఠమని.. పెద్దలు చేసినట్లే పిల్లలు కూడా చేస్తారని పలువురు చెప్పారు. పౌర స్పృహను మరింతగా పెంపొందించడంలో పాఠశాలలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.



## 3 నిమిషాల్లో 56 పానీపూరీలు స్వాహా!

వినాయచవితి అనగానే.. మండపాల్లో నిర్వహించే పోటీలకు భలే క్రేజ్ ఉంటుంది. ఆ పోటీలు కూడా భలే సరదాగా ఉంటాయి. అన్ని వయసుల వారు పాల్గొంటారు. చిన్న చిన్న గల్లీలతోపాటు భారీ స్థాయిలో పోటీలు నిర్వహించే సందర్భాలు కూడా ఉంటాయి. తాజాగా గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో పానీపూరీ, లడ్డూ పోటీలు నిర్వహించారు. స్థానిక రేస్ కోర్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో నేహాబెన్ అనే మహిళ కేవలం 3 నిమిషాల్లో 56 పానీపూరీలను తినేసి.. విజేతగా నిలిచింది. అంతేకాకుండా 70 ఏళ్ల గోవిందభాయ్ అనే వ్యక్తి ఏకంగా 17 లడ్డూలను ఆరగించేశారు. ఒక్కో లడ్డు బరువు 100 గ్రా. తొలుత పురుషులకు 5 లడ్డూలు, మహిళలకు 3 లడ్డూలు ఇచ్చి 3 నిమిషాల్లో తినాలని షరతు విధించారు. అందులో నెగ్గిన వారికి.. 20 నిమిషాల్లో ఎన్ని లడ్డూలు తినగలరో అన్ని తినొచ్చని చెప్పారు. ఈ క్రమంలో 70 ఏళ్ల వయసులోనూ గోవింద్ 1.7కేజీల లడ్డూలు తిని ఔరా అనిపించారు. 2008 నుంచి రేస్ కోర్స్ గ్రౌండ్‌లో ఈ తరహా పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధి వినాయక ధామ్ గణేశ్ మహోత్సవ్ కమిటీ వెల్లడించింది.



## ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయండి: శశిథరూర్

కొత్త ఓటర్లను చేర్చడం, పేర్లను తొలగించడం వంటి విషయాలు ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. దాంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్ ఈసీఐనెట్ యాప్ పై వివాదం చెలరేగుతోంది. ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పిలుపునివ్వడం చర్చనీయాంశమైంది. గోవాలో సర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలే థరూర్ స్పందనకు కారణం. ఆ రాష్ట్రంలో కొందరు ఓటర్ల విషయంలో వైరుధ్యాలను డేటాబేస్ గుర్తించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం.. అందులోని 97 మంది తుది ఓటరు జాబితాలో చేర్పునకు అర్హులేనని ఓటరు నమోదు అధికారులు గుర్తించారు. అయితే వారి పేర్లను ఓటరు జాబితాలో పునరుద్ధరించేందుకు వారికి ఆప్షన్ అందుబాటులో లేదు. దీంతో రోల్‌బ్యాక్ ఆప్షన్ కోసం గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఈసీకి విన్నవించాల్సి వచ్చింది. కానీ, వారి నుంచి అనుమతులు లభించకపోవడంతో ఓటర్ల పేర్లు ఎంటర్ చేయలేకపోయారని, ఆ యాప్‌ను దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని జాతీయ మీడియా కథనం పేర్కొంది. గోవాలో ఓటరు జాబితాలో పేరు లేకపోతే.. కేవలం ఓటు మిస్ అవడమే గాకుండా, అనేక ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోతారు. ఇదే రాజకీయంగా తీవ్ర వివాదమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో లేని సూపర్‌స్పెషాలిటీ చికిత్సల (డయాలసిస్, యాంజియోప్లాస్టీ, ఓపెన్‌హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటివి) కు నిధులు సమకూర్చే గోవా మెడిక్లెయిమ్ పథకం కేవలం ఆ రాష్ట్ర ఓటర్లకు మాత్రమే అందుబాటులో ఉందని ఆ కథనం పేర్కొంది. దీనిపైనే థరూర్ స్పందించారు. ''ఇది తీవ్రమైన విషయం. దీని ద్వారా భారత పౌరుల రాజ్యాంగ హక్కులు కోల్పోవడమే గాకుండా డయాలసిస్ వంటి పలు చికిత్సలకూ దూరం అవుతున్నారు. రాజకీయ కుతంత్రాలే చెడ్డవనుకుంటే.. ఇక అమానవీయ ప్రవర్తన ఏమాత్రం సహించలేనిది. దీనిపై ఎన్నికల సంఘం క్షమాపణ చెప్పాలి. రాజీనామా కోరడం చాలా చిన్న డిమాండ్. ఈ వినాశకరమైన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలి. అది కలిగించిన నష్టాన్ని సరిదిద్దడం అత్యావశ్యకం'' అని థరూర్ పోస్టు పెట్టారు.




# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 5 రోజుల ముందే జీతం

ఢిల్లీ: దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలాఖరులో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్‌ను ఐదు రోజుల ముందే వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది.



నెలాఖరులో వేతన చెల్లింపులకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు బ్యాంకు సమ్మె నేపథ్యంలో ఈ నెల 27న (ఆదివారం) బ్యాంకులు పనిచేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దీంతో ఆ రోజు ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు తెరుచుకోనున్నాయి.

# లిస్టింగ్ తర్వాత 5% జంప్.. టాప్-10 జాబితాలోకి NSE

ఢిల్లీ: ఎన్నో అంచనాల మధ్య లిస్టింగ్‌కు వచ్చి నిరుత్సాహ పరిచిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE) అరుదైన మైలురాయిని అందుకుంది. ఫ్లాట్‌గా ట్రేడింగ్ మొదలైనప్పటికీ.. ఆ తర్వాత షేర్లు 5 శాతం మేర రాణించడంతో ఎన్ఎస్ఈ ఎలైట్ క్లబ్‌లో చేరింది. మార్కెట్ విలువ పరంగా టాప్10 కంపెనీల్లో (Top 10) ఒకటిగా నిలిచింది. ఎన్ఎస్ఈ షేర్లు ఈ ఉదయం స్వల్ప లాభాల్లో బీఎస్ఈలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇష్యూ ధర రూ.1785తో పోలిస్తే కేవలం 0.84 శాతం లాభంతో రూ.1800 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై షేరు ధర 5.21 శాతం లాభంతో రూ.1878కి చేరింది. దీంతో మార్కెట్ విలువ 4.54 లక్షల కోట్లకు (రూ.4,54,966.88 కోట్లు) పెరిగింది. ఈ క్రమంలో బీఎస్ఈ నమోదిత కంపెనీల్లో టాప్ 10 జాబితాలో ఎన్ఎస్ఈ చేరింది. హిందుస్థాన్ యునిలీవర్‌ను 11వ స్థానానికి నెట్టింది.

**టాప్-10 కంపెనీలు ఇవే..**

* రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.16,67,750.07 కోట్లు
* భారతీ ఎయిర్‌టెల్ రూ.11,32,338.92 కోట్లు
* హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.11,26,035.78 కోట్లు
* ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,57,570.88 కోట్లు
* స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.9,12,415.14 కోట్లు
* టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూ.7,57,627.53 కోట్లు
* బజాజ్ ఫైనాన్స్ రూ.6,15,435.85 కోట్లు
* లార్సెన్ అండ్ టుబ్రో రూ.5,32,457.60 కోట్లు
* ఎల్ఐసీ రూ.5,13,716.31 కోట్లు
* నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ రూ.4,54,966.88 కోట్లు

# అమెజాన్, మీషోతో జట్టు కట్టిన యూట్యూబ్.. క్రియేటర్లకు మరింత ఆదాయం

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్.. భారత్‌లోని తన కంటెంట్ క్రియేటర్ల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి అధిక ఆదాయం అందించాలనే లక్ష్యంతో షాపింగ్ అఫిలియేట్ ప్రోగ్రామ్‌ను మరింత విస్తరించింది. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, మింత్ర, నైకా వంటి ఇకామర్స్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్న యూట్యూబ్.. కొత్తగా అమెజాన్, అజియో , మీషో, స్నాప్‌డీల్, టాటా CLiQతో జట్టుకట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. “స్థానిక క్రియేటర్లకు అదనపు ఆదాయం కల్పించాలనే ఉద్దేశంతో షాపింగ్ అఫిలియేట్ ప్రోగ్రామ్‌ను విస్తరించాం. మా వ్యాపార భాగస్వాముల ఉత్పత్తులు వారికి అధిక సంపద సృష్టిస్తాయి” అని యూట్యూబ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గుంజన్ సోని తెలిపారు.

**కొత్త ఏఐ టూల్స్**

ఆస్క్ యూట్యూబ్ ఫర్ షాపింగ్ అనే కొత్త ఏఐ టూల్‌ను యూట్యూబ్ తీసుకొచ్చింది. వీడియో చూస్తున్నప్పుడే నేరుగా టెక్స్ట్ లేదా వాయిస్ రూపంలో వీక్షకులు ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకోవచ్చు. అంతర్జాతీయ వీక్షకుల కోసం.. అందుకు తగినట్లుగా స్థానిక కరెన్సీలో డీల్స్ మారేలా ట్యాగ్స్ ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అయ్యేలా ఏఐ టూల్ తీసుకొచ్చింది.

**షాపింగ్ అఫిలియేట్ ప్రోగ్రామ్ అంటే..**

ఈ ప్రోగ్రామ్‌ను యూట్యూబ్ 2024లో తీసుకొచ్చింది. ఇకామర్స్ సంస్థలతో భాగస్వామ్యం




కుదుర్చుకొని.. వారి ఉత్పత్తులను అర్హత కలిగిన కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోలు, షార్ట్స్ లేదా లైవ్‌స్ట్రీమ్‌లలో ట్యాగ్ చేయొచ్చు. వీక్షకులు ఆ ట్యాగ్‌ను క్లిక్ చేసి ప్రొడక్ట్స్ కొనుగోలు చేస్తే క్రియేటర్లకు ఆదాయం వస్తుంది.

# విద్యార్థులకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ గుడ్‌న్యూస్.. టికెట్ ఛార్జీలపై 10%తగ్గింపు

పండగ సీజన్ వేళ విద్యార్థులకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ గుడ్‌న్యూస్ చెప్పింది. స్టూడెంట్ డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. దేశ, అంతర్జాతీయ విమాన ఛార్జీలపై డిస్కౌంట్‌తో పాటు ఎక్స్‌ట్రా బ్యాగేజ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. విద్యార్థులతో పాటు ఇతర కస్టమర్లకు కూడా మరో ఆఫర్‌ను ప్రకటించింది.




**స్టూడెంట్లకు ప్రత్యేక ఆఫర్**

విమాన ప్రయాణాలు చేసే విద్యార్థులకు దేశ, అంతర్జాతీయ విమాన ఛార్జీలపై బేస్ ఫేర్‌పై 10 శాతం డిస్కౌంట్ అందిస్తుంది. అదనంగా మరో 10 కేజీల బ్యాగేజీని తీసుకెళ్లే సదుపాయం కల్పించింది. సాధారణంగా 15 కేజీల బ్యాగేజీకి మాత్రమే అనుమతిస్తారు. ఆఫర్‌లో భాగంగా 25 కేజీల బ్యాగేజీ వరకు వెంట తీసుకెళ్లొచ్చు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రయాణ తేదీలను మార్చుకోవాల్సి వస్తే.. రూ.99కే తేదీలు మార్చుకోవచ్చు. అక్టోబర్ 20 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. కనీసం 12 ఏళ్ల వయసు ఉండాలి. గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి ఫొటోతో కూడిన ఐడీ ఉండాలి. అందులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు తప్పనిసరి.

**ఇతర కస్టమర్లకు**

విద్యార్థులతో పాటు కస్టమర్లకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్లు ప్రకటించింది. తమ వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు టికెట్లపై 5 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. బుకింగ్ సమయంలో ప్రోమోలో కనిపించే VIBES కోడ్ ఉపయోగిస్తే ఈ ఆఫర్ వర్తిస్తుంది. వీసా డెబిట్ లేదా క్రెడిట్ కార్డులను ఉపయోగించి టికెట్ బుక్ చేసుకున్నవారికి డిస్కౌంట్ ఇస్తోంది. అధికారిక వెబ్‌సైట్‌లో కనిపించే ప్రోమో కోడ్ ఉపయోగించి ఛార్జీలపై రూ.600 వరకు ఆఫర్ పొందొచ్చు. ఈ ఆఫర్ కేవలం అక్టోబర్ 9 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది.

# అపోలో హాస్పిటల్స్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఉపాసన

హైదరాబాద్: ప్రముఖ హాస్పిటల్ చైన్ అపోలో హాస్పిటల్స్ ప్రాజెక్ట్స్ విభాగానికి నటుడు రాంచరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదెల డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సీఎస్ఆర్ విభాగానికి ఆమె వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ హోదాలో దేశవ్యాప్తంగా ఆసుపత్రి ప్రాజెక్టుల అభివృద్ధిని ఆమె పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఉపాసన స్వయంగా పోస్ట్ పెట్టారు. విస్తరణ ప్రణాళికలో భాగంగా రూ.8600 కోట్లు పెట్టుబడికి అపోలో హాస్పిటల్స్ సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చోటుచేసుకోవడం ప్రాధాన్యం




సంతరించుకుంది. అందరికీ ప్రపంచస్థాయి వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో అపోలో హాస్పిటల్స్‌ను తమ తాతగారైన డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ఏర్పాటు చేశారని ఉపాసన పేర్కొన్నారు. దాన్ని ముందుకు తీసుకెళ్లడం తనపై ఉన్న బాధ్యతగా ఫార్చ్యూన్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అపోలో హాస్పిటల్స్‌తో పాటు డిజిటల్ వెల్‌నెస్, కార్పొరేట్ ప్లాట్‌ఫామ్ అయిన యువర్‌లైఫ్ (URlife)కు కూడా ఉపాసన మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.




# 400మీ. రిలేలో రజతం.. 16 ఏళ్ల తర్వాత 10వేల మీ. రేసులో కాంస్యం






అథ్లెటిక్స్‌లో భారత్ క్రీడాకారులు పతకాలు సాధించడం మొదలుపెట్టారు. తాజాగా 4X400 రిలేలో భారత్‌కు రజతం దక్కింది. అలాగే 10 వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్యం వరించింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 17కి చేరుకుంది. ఇందులో ఒక స్వర్ణం, ఏడు రజతాలు, తొమ్మిది కాంస్యాలు ఉన్నాయి.

**కాస్తలో స్వర్ణం మిస్..**

400 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో భారత్‌కు రజతం వరించింది. మను, పూవమ్మ, విశాల్, విద్యతో కూడిన భారత జట్టు 3:14.46 నిమిషాల్లో రేసును పూర్తి చేసింది. అంతకుముందు బహ్రెయిన్ జట్టు 3:12.87 నిమిషాల్లో దూసుకెళ్లి అగ్రస్థానంతో స్వర్ణం గెలుచుకుంది. కేవలం 8 మిల్లీ సెకన్ల తేడాతో వెనుకబడిన వియత్నాం జట్టు కాంస్యంతో సరిపెట్టుకుంది.

**2010లో వచ్చింది.. మళ్లీ ఇప్పుడు**

10వేల మీటర్ల రేసింగ్‌లో భారత్‌కు కాంస్యం వచ్చింది. అథ్లెట్ సీమా రేసును 32:50.05 నిమిషాల్లో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. దీంతో 16 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం రావడం గమనార్హం. చివరిసారిగా 2010లో భారత అథ్లెట్లు స్వర్ణం, రజతం గెలిచారు. ఇప్పుడు సీమా కాంస్యంతో మెరిసింది. బహ్రెయిన్‌కు చెందిన విన్‌ఫ్రెడ్ యవీ స్వర్ణం, జపాన్‌కు చెందిన నొజోమీ తనకా రజతాన్ని కైవసం చేసుకున్నారు. సీమ స్వర్ణ పతక విజేత కంటే 10.87 సెకన్లు మాత్రమే వెనకబడింది. సీమాకు ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. “ఆసియా క్రీడల్లో 10వేల మీటర్ల పరుగు పందెంలో కాంస్యం నెగ్గిన సీమాను చూసి భారత్ గర్విస్తోంది. నిబద్ధతతో కూడిన ఆమె పోరాటం నిజంగా అద్భుతం. చాలా ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా” అని పోస్టు పెట్టారు.

# వైఫల్యాలనూ మనస్ఫూర్తిగా స్వీకరిస్తా: రెండేళ్ల పదవీకాలంపై గంభీర్

భారత ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నాడు. మూడు ఫార్మాట్లలోనూ విజయాలతోపాటు ఓటములనూ చవిచూశాడు. మరీ ముఖ్యంగా స్వదేశంలో టెస్టు సిరీస్‌లను భారత్ కోల్పోయింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు టీ20 ప్రపంచ కప్ విజేతగా టీమ్‌ఇండియా నిలిచింది. తన రెండేళ్ల పదవీకాలంలో ఒడుదొడుకులను చవిచూశానని.. వైఫల్యాలను అంగీకరిస్తానని గంభీర్ తెలిపాడు. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో మూడు వన్డేల (IND vs WI) సిరీస్ మొదలుకానుంది. “ఈ రెండేళ్లు రెప్పపాటులో గడిచిపోలేదు. విజయాలతోపాటు వైఫల్యాలను కూడా చవిచూశా. ప్రధాన కోచ్ వంటి బాధ్యతను తీసుకున్నప్పుడు ఇలాంటి కష్టనష్టాలు సహజమని నమ్ముతా. మూడు ఫార్మాట్ల క్రికెట్‌లోనూ ఎన్నో విజయాలు సాధించా. ఎప్పటికీ గుర్తుండిపోతాయి. అలాగే వైఫల్యాలనూ మరిచిపోలేను. వాటిని కూడా మనస్ఫూర్తిగా స్వీకరిస్తా” అని గంభీర్ వెల్లడించాడు.

**రోహిత్‌తో అనుబంధంపై..**

“మా ఇద్దరి మధ్య కేవలం కోచ్, ప్లేయర్‌కు మధ్య ఉన్న సంబంధం మాత్రమే కాదు.. అంతకుమించి




ఉంది. రోహిత్ జట్టులోకి వచ్చినప్పుడు నేను అప్పటికే సీనియర్‌ను. నా గురించి రోహిత్‌కు బాగా తెలుసు. మేమిద్దరం కలిసి ఆడినప్పుడు ఇంకా బాగుండేది. నా ఆలోచనలు ఎలా ఉంటాయో రోహిత్‌కు తెలుసు. అతడు కెప్టెన్‌గా ఉన్నప్పుడు నేను కోచ్‌గా వచ్చా. మా ఇద్దరి ఆలోచనలు వేరైనా జట్టు అవసరానికి ఏది బెటర్ అయితే అదే ఫైనల్ అవుతుంది. ఇప్పటి వరకు నేను పనిచేసిన నలుగురు సారథులతో నా అనుభవం అదే. ప్రతి ఒక్కరి దృష్టి భారత జట్టు వృద్ధిపైనే ఉంది” అని గంభీర్ తెలిపాడు.

# మాథ్యూ బ్రీట్జ్కే అద్భుతం.. 38 ఏళ్ల నాటి సిద్ధూ రికార్డు సమం

దక్షిణాఫ్రికా ఆటగాడు మాథ్యూ బ్రీట్జ్కే అద్భుత ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. తొలి 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఆటగాడిగా భారత మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సిద్ధూను బ్రీట్జ్కే సమం చేశాడు. తాజాగా ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో బ్రీట్జ్‌కే (112) సెంచరీ చేశాడు. దీంతో 38 ఏళ్ల కిందట సిద్ధూ రికార్డును సమం చేశాడు. సిద్ధూ తొలి 14 ఇన్నింగ్స్‌ల్లో ఎనిమిది హాఫ్ సెంచరీలు చేశాడు. ఇప్పుడు బ్రీట్జ్కే 8 అర్ధశతకాలు చేయడం గమనార్హం. ఇందులో రెండు సెంచరీలు కూడా ఉన్నాయి. కేవలం వీరిద్దరు మాత్రమే ఈ అరుదైన ఘనతను సాధించారు.

**ఆ రికార్డు బద్దలు**

తొలి 14 వన్డేల్లో సిద్ధూ 634 పరుగులు చేశాడు. కానీ, బ్రీట్జ్కే మాత్రం 822 రన్స్ రాబట్టాడు. 14 మ్యాచుల తర్వాత అత్యధిక పరుగులు




చేసిన బ్యాటర్‌గా బ్రీట్జ్కే రికార్డు సృష్టించాడు. అంతకుముందు ఈ ఘనత పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ పేరిట ఉండేది. అతడు 769 పరుగులు చేశాడు. బ్రీట్జ్కే తన తొలి అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లో 150 పరుగులు చేసి అదరగొట్టాడు.

# డబ్ల్యూఏపీఎల్ 2026.. మళ్లీ రెండు మ్యాచులూ రద్దు

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్ 2026 మ్యాచులకు వర్షం ఇవాళ కూడా అంతరాయం కలిగించింది. మంగళగిరిలో భారీగా వర్షాలు పడటంతో కనీసం టాస్ కూడా వేయకుండానే రెండుమ్యాచులు రద్దు చేయాల్సి వచ్చింది. తొలుత మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్ వైజాగ్ ఫైర్ బర్డ్స్ మ్యాచ్ రద్దు కాగా.. తాజాగా అమరావతి ఈ ఛాంపియన్స్ గోదావరి గోల్డెన్ ఈగల్స్ మ్యాచ్‌ను రద్దు చేస్తూ అంపైర్లు ప్రకటించారు. దీంతో నాలుగు జట్లకు తలా ఒక పాయింట్ కేటాయించారు.

**టాప్ -2లో.**

ప్రస్తుతం ప్రతి టీమ్ కూడా ఐదేసి మ్యాచులను ఆడేశాయి.



పట్టికలో రాయలసీమ జెన్ స్టార్స్ (6), అమరావతి ఈ ఛాంపియన్స్ (6), గోదావరి గోల్డెన్ ఈగల్స్ (6), వైజాగ్ ఫైర్ బర్డ్స్ (2) పాయింట్లతో ఉన్నాయి. లీగ్ స్టేజ్‌లో చివరి మ్యాచ్‌లు శుక్రవారం జరుగుతాయి. అవి కూడా రద్దు అయితే మాత్రం ప్రస్తుతం ఉన్న స్థానాలే కొనసాగుతాయి. అప్పుడు టాప్ 2లో ఉన్న రాయలసీమ, అమరావతి ఫైనల్‌లో ట్రోఫీ కోసం తలపడతాయి. ఆదివారం తుది పోరు జరగనుంది.



## తొలిసారి డ్యూయల్ రోల్‌లో
# శర్వానంద్

కెరీర్‌లో ఫస్ట్ టైమ్ టాలీవుడ్ హీరో శర్వానంద్ డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నాడు. అతడు హీరోగా సీనియర్ డైరెక్టర్ శ్రీనువైట్ల డైరెక్షన్‌లో జార్జ్ క్రిష్ ఫేరుతో ఫన్ లవ్ స్టోరీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో శర్వానంద్ సరసన మానస చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. డైరెక్టర్ శ్రీనువైట్ల బర్త్‌డే సందర్భంగా జార్జ్ క్రిష్ ఫస్ట్ లుక్ వీడియోను మేకర్స్ గురువారం రిలీజ్ చేశారు. ఫస్ట్ బూస్టర్ పేరుతో రిలీజ్ చేసిన ఈ వీడియోలో క్రిస్టియన్ యువకుడు జార్జ్‌గా, హిందూ అబ్బాయి క్రిష్‌గా రెండు డిఫరెంట్ లుక్‌లలో శర్వానంద్ కనిపించాడు. ఈ పాత్రల మధ్య శర్వానంద్ చూపించిన వేరియేషన్స్, అతడి ఎక్స్‌ప్రెషన్స్ నవ్విస్తున్నాయి. ఇవి రెండు మాత్రమే కాకుండా మరో క్లాస్ లుక్‌లో కనిపించి సర్‌ప్రైజ్ చేశాడు. శ్రీనువైట్ల మార్కు కామెడీతో ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ తెరకెక్కుతోంది. ప్రస్తుతం జార్జ్ క్రిష్ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 14న ఈ మూవీని థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు.

# విలన్‌గా రష్మిక ?

హీరోయిన్లు అంటే పాటలు, గ్లామర్ కోసమే పరిమితం అనే ట్రెండ్‌ను తిరగరాస్తోంది నేషనల్ క్రష్ రష్మిక మందన్న. తాజాగా కెరీర్‌లో ఫస్ట్ టైమ్ నేషనల్ క్రష్ విలన్‌గా కనిపించబోతుంది. అల్లు అర్జున్ హీరోగా సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కథతో రాకా మూవీ తెరకెక్కుతోంది. ఈ పాన్ ఇండియన్ మూవీలో దీపికా పదుకోణ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమెతో పాటు రష్మిక మందన్న, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ కథానాయికలుగా కనిపించబోతున్నట్లు చాలా వార్తలొస్తున్నాయి. తాజాగా ఈ రూమర్లను నిజం చేస్తూ రష్మిక ఇటీవలే రాకా షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. ప్రస్తుతం ముంబైలో జరుగుతోన్న షెడ్యూల్‌లో అల్లు అర్జున్, రష్మిక మందన్నలపై డైరెక్టర్ అట్లీ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సైన్స్ ఫిక్షన్ సినిమాలో రష్మిక మందన్న నెగెటివ్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్‌కు ధీటుగా ఆమె విలనిజం ఉంటుందని అంటున్నారు.





సినిమా

## ...ో కేథరిన్

...ాంగ్ చేసింది. దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరోగా నటించాడు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా కనిపిస్తోంది. ఈ సినిమాలో సులోచన అంటూ సాగే ఓ పాటలో సందీప్‌కిషన్‌తో కలిసి కేథరిన్ స్టెప్పులు వేసింది. ఈ మాస్ సాంగ్‌కు కేథరిన్ గ్లామర్ హైలైట్‌గా నిలవబోతున్నట్లు మేకర్స్ చెబుతోన్నారు. ఈ ప్రత్యేక గీతం కోసం కేథరిన్ కోటిన్నర రెమ్యూనరేషన్ డిమాండ్ చేసినట్లు సమాచారం. హీరోయిన్ ఫరియా అబ్దుల్లా కంటే కేథరిన్ ఎక్కువ రెమ్యూనరేషన్ దక్కించుకున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## రెట్రో లుక్‌లో రణ్‌భీర్‌కపూర్



బాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ జోడీగా పేరుతెచ్చుకున్నారు రణ్ భీర్‌కపూర్, అలియా భట్. ఈ జోడీ తాజాగా మరో చిత్రంలో నటిస్తోంది. లవ్ అండ్ వార్ అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది జనవరి 21న థియేటర్లలోకి రాబోతుంది. రణ్ భీర్‌కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ గురువారం రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో చాలా వయలెంట్‌గా ఈ బాలీవుడ్ హీరో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## అమెజాన్ ప్రైమ్‌లో రంభ ఊర్వశి మేనక

యాంకర్ విష్ణుప్రియ ప్రధాన పాత్రలో నటించిన తెలుగు రొమాంటిక్ ఫాంటసీ కామెడీ మూవీ రంభ ఊర్వశి మేనక థియేటర్లలో డిజాస్టర్‌గా నిలిచింది. అల్లరి నరేష్ హీరోగా, సురభి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో విష్ణుప్రియతో పాటు రాశీసింగ్, ప్రిషా సింగ్, సీనియర్ నరేష్, వెన్నెలకిషోర్ కీలక పాత్రల్లో కనిపించారు. సెప్టెంబర్ 25 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ మూవీ స్ట్రీమింగ్ కాబోతుంది. గురువారం రిలీజ్ డేట్‌ను ఓటీటీ ప్లాట్‌ఫామ్ అఫీషియల్‌గా ప్రకటించింది. హాస్య మూవీస్‌తో కలిసి అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మించింది. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించారు.



# చంపుతామంటున్నారు..

టాలీవుడ్ కొరియోగ్రాఫర్స్ శేఖర్, రఘు మాస్టర్‌లపై జానీ మాస్టర్ భార్య సుమలత దేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంపుతానంటూ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనతో పాటు తన కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని ఈ ఫిర్యాదులో పేర్కొన్నది. తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేయకపోతే చంపేస్తామని కొందరు తీవ్రంగా బెదిరించినట్లు పేర్కొన్నారు. తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ లో గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి.